నమస్తే తెలంగాణ
వరంగల్
5 | వరంగల్, సోమవారం 18 నవంబర్ 2024 | WARANGAL



ఉమ్మడి జిల్లా నేతలతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

# కాంగ్రెస్ పాలనలో ఎస్టీలపై దాడులు

- లగచర్ల ఘటన బాధాకరం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు
- ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ నేతలతో సమావేశం

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 17: కాంగ్రెస్ పాలనలో రోజురోజుకూ రాష్ట్రంలో ఎస్టీలపై దాడులు జరుగుతున్నాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నెరవేర్చక ఇప్పటికే రైతన్నలను మోసం చేసిందన్నారు. లగచర్ల ఘటన బాధాకరమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, సన్నకారు రైతుల భూములు గుంజుకుని ఏమైనా చేస్తానంటే తెలంగాణ సమాజం మొత్తం తిరుగుబాటు చేస్తుందన్నారు. రేవంత్‌రెడ్డి సొంత జిల్లా, నియోజక వర్గ రైతులు, ప్రజలు కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా తిరగబడ్డారని అన్నారు. రేపు రాష్ట్రం మొత్తం రేవంత్ సర్కారుపై తిరగబడుతుందన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలు, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి పేరిట తులం బంగారం, మహిళలకు రూ.2500 హామీలు, లగచర్ల ఘటనపై త్వొందర్లోనే కేసీఆర్, కేటీఆర్ ఆదేశాల మేరకు భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ డాక్టర్ల క్లినిక్‌లపై దాడులు

**పలువురిపై కేసు నమోదు చేసిన వైద్యమండలి అధికారులు**



నకిలీ డాక్టర్లు నిర్వహిస్తున్న క్లినిక్‌లలో తనిఖీలు చేస్తున్న వైద్య మండలి అధికారులు

వరంగల్, నవంబర్ 17 : నగరంలో ఆర్‌ఎంపీ, పీఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లపై రాష్ట్ర వైద్య మండలి అధికారులు దాడులు చేశారు. కేవలం ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను నిర్వహించాల్సిన ఆర్‌ఎంపీ, పీఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా క్లినిక్‌లను నిర్వహించడం, ఇటీవల అనేక ఫిర్యాదులు రావడంపై అధికారులు దృష్టిపెట్టారు. సోమవారం దీన్‌దయాళ్‌నగర్‌లో పీఎంపీ బండి సదానందం జనరల్ ప్రాక్టీషనర్‌గా ప్రిస్కిప్షన్ రాయడం, అందులో స్టెరాయిడ్, ఎక్కువ డోస్ కలిగిన యాంటీబయాటిక్ మందులు ఉండడం, బెడ్స్ వేసి ఆస్పత్రి నిర్వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ప్రిస్కిప్షన్‌పై హై పవర్ డ్రగ్స్ విక్రయిస్తున్న వీణా మెడికల్, సాగరిక మెడికల్ స్టోర్స్‌పై డ్రగ్ కంట్రోల్ అథారిటీకి ఫిర్యాదు చేస్తామని అధికారులు తెలిపారు. అక్కడే మరో నకిలీ డాక్టర్ మిట్టపల్లి సాంబమూర్తి క్లినిక్, కాజీపేటలో ల్యాబ్ టెక్నీషియన్ చదివిన ప్రభాకర్ క్లినిక్‌లలో తనిఖీ చేశారు. వారు స్టెరాయిడ్స్, యాంటీబయాటిక్ మందులు రోగులకు అందించడంపై ఆధారాలు సేకరించిన అధికారులు కేసులు నమోదు చేశారు. అనంతరం టీజీఎంసీ అధికారి డాక్టర్ నరేశ్ మాట్లాడుతూ.. అర్హత లేకున్నా క్లినిక్‌లు నిర్వహిస్తున్నారని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. క్వాలిఫైడ్ డాక్టర్లు సైతం వీరిని ఏజెంట్లుగా పెట్టుకుని రోగులను రప్పించుకుని కమిషన్లు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారన్నారు. అలాంటి దవాఖానలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఐఎంఏ అధ్యక్షుడు అన్సార్ మియా మాట్లాడుతూ.. డాక్టర్‌గా అర్హతలేని పీఎంపీ, ఆర్‌ఎంపీలు రాసిన ప్రిస్కిప్షన్లపై మెడికల్ షాపులు మందులు విక్రయించొద్దన్నారు. తనిఖీల్లో హెచ్‌ఆర్‌డీఏ కార్యదర్శి డాక్టర్ రితీశ్ తదితరులు పాల్గొన్నారు.

# మేడారంలో భక్తుల మొక్కులు



సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న భక్తులు

తాడ్వాయి, నవంబర్ 17 : వనదేవతలు మేడారం సమ్మక్క, సారలమ్మను భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. సెలవుదినం కావడంతో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. మొదట జంపన్న వాగులో పుణ్యస్నానాలాచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. అనంతరం అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకుని సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెలపై పసుపు, కుంకుమ, ఎత్తుబెల్లం, నూతన వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించి గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, మంగపేట మండలంలోని బాలన్నగూడేనికి చెందిన జంట అమ్మవార్ల సన్నిధిలో వివాహం చేసుకుంది.

- అదనపు బకెట్‌కు రూ. 7,200 వసూలు
- కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారి.. అక్రమ దందా
- అరకొరగానే ఆన్‌లైన్ బుకింగ్‌లు
- అయినా.. భారీగా తరలుతున్న లారీలు
- ప్రభుత్వ ఖజానాకు పెద్ద ఎత్తున గండి
- ఓవర్ లోడ్‌తో పట్టుబడుతున్న వాహనాలు
- పట్టించుకోని టీఎస్‌ఎండీసీ అధికారులు

# లోడింగ్ అధనం

## గోదావరి సాక్షిగా ఇసుక దోపిడీ



లారీలో ఇసుక లోడ్ చేస్తున్న దృశ్యం

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ) : గోదావరి సాక్షిగా ఇసుక దోపిడీ కొనసాగుతూనే ఉంది. కాంట్రాక్టర్ల అండదండలతో ఎలాంటి ఆన్‌లైన్ బుకింగ్ లేకుండానే ఇసుక తరలుతున్నది. అలాగే క్వారీల వద్ద అదనపు బకెట్ దందాకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నది. ఓవర్ లోడ్, జీరో దందాలో పోలీసులకు పట్టుబడుతున్న లారీలే ఇందుకు నిదర్శనం. లారీల్లో అదనంగా ఒక బకెట్ ఇసుక నింపితే రూ. 7,200 వసూలు చేస్తున్నట్లు పలువురు లారీ యజమానులే పేర్కొంటున్నారు. కాంట్రాక్టర్లు కూటమి కట్టి ఇసుక దోపిడీ తెగబడుతున్నారు. ఆన్‌లైన్ బుకింగ్ లేకుండానే ఇసుకను తరలిస్తున్నారంటే క్వారీల వద్ద అవినీతి ఏ మేరకు జరుగుతుందో అవగతమవుతుంది. పోలీసులు ఇటీవల పట్టుకున్న ఇసుక లారీల్లో ఆన్‌లైన్ బుకింగ్ లేనివే అధికంగా ఉన్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతున్నా టీఎస్‌ఎండీసీ అధికారులు నోరు మెదపడం లేదు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలంలోని గోదావరిలో ఏర్పాటు చేసిన ఇసుక క్వారీల్లో రోజుకు రూ. లక్షల్లో జీరో, అదనపు బకెట్ దందా జోరుగా సాగుతున్నది.

**నాలుగు క్వారీల నుంచి..**

మహదేవపూర్ మండలం పరిధిలో మొత్తం 13 క్వారీలుండగా, ప్రస్తుతం నాలుగింటి నుంచి మాత్రమే ఇసుక రవాణా జరుగుతున్నది. మద్దులపల్లి క్వారీ నుంచి 60, విలాసాగర్ 50, పెద్దంపేట నుంచి 40, పంకెన క్వారీ నుంచి 60 లారీలు ప్రతిరోజూ ఇసుక రవాణా చేస్తున్నాయి. ఈ క్వారీల్లో జీరో, అదనపు బకెట్ దందా జోరుగా సాగుతున్నట్లు పోలీసులు పట్టుకుంటున్న లారీల ద్వారా తెలుస్తున్నది. సిండికేట్‌గా మారిన కాంట్రాక్టర్లు అదనపు బకెట్ ఇసుకకు రూ. 2 వేలు, లోడింగ్ చార్జి రూ. 3,500, ఆపరేటర్‌కు రూ.500, లేబర్‌కు రూ. 1,000, కాంటాకు రూ. 200 చొప్పున ఒక్కో లారీ నుంచి రూ. 7,200 వసూలు చేస్తున్నట్లు లారీ యజమానులు ఆరోపిస్తున్నారు. మరో అదనపు బకెట్‌కు కూడా రూ. 2 వేలు వసూలు చేస్తున్నట్లు చెపుతున్నారు. ఒక బకెట్‌కు 5 టన్నుల చొప్పున ప్రతి లారీలో రెండు బకెట్ల (10 టన్నులు) ఇసుక తరలిపోతున్నది. ఇలా రోజుకు 200 లారీల నుంచి సుమారు రూ. 18 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు అదనపు ఆదాయాన్ని అక్రమంగా సంపాదిస్తున్నారు. ఇందులో టీఎస్‌ఎండీసీ అధికారులకు వాటాలు ముడుతున్నాయని, అందువల్లే వారు నోరు మెదపడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక నెలలోనే సుమారు 20 లారీలు ఓవర్ లోడ్‌తో పోలీసులకు పట్టుబడ్డాయి. మరో లారీ ఎలాంటి ఆన్‌లైన్ బుకింగ్ లేకుండా ఇసుకను తీసుకువెళ్తున్నదన్న సమాచారం మేరకు పోలీసులు పట్టుకునే ప్రయత్నం చేయగా మహదేవపూర్‌లో ఇసుకను డంప్ చేసి వెళ్లిపోయింది. ఇసుక క్వారీల కాంట్రాక్టర్లు చేస్తున్న అక్రమ దందాతో ప్రభుత్వానికి రోజుకు రూ. 16 లక్షల నుంచి 25 లక్షల వరకు ఆదాయానికి గండి పడుతున్నట్లు తెలుస్తున్నది.

# రామాకు మరో అరుదైన గౌరవం

- జీవన సాఫల్య పురస్కారం ప్రకటించిన ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు
- 22, 23న ఖతార్‌లో చంద్రమౌళికి ప్రదానం చేయనున్న నిర్వాహకులు



మాజీ సీఎం కేసీఆర్ చేతుల మీదుగా కాళోజీ పురస్కారాన్ని అందుకుంటున్న రామా చంద్రమౌళి (ఫైల్)



పోచమ్మమైదాన్, నవంబర్ 17 : ప్రముఖ కవి రామా చంద్రమౌళికి మరో అరుదైన గౌరవం దక్కింది. ఆయన సాహితీ సేవలను గుర్తించిన ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు నిర్వాహకులు జీవన సాఫల్య పురస్కారం ప్రకటించారు. ఈ నెల 22, 23వ తేదీల్లో దోహా (ఖతార్)లో జరుగనున్న సదస్సులో రామా చంద్రమౌళికి ఈ అవార్డును అందజేయనున్నారు.

**సాహితీసేవకు జీవితం అంకితం..**

వరంగల్ పోచమ్మమైదాన్‌కు చెందిన రామా చంద్రమౌళి ప్రొఫెసర్‌గా విద్యార్థులకు సేవలందించడంతో పాటు కవి, రచయితగా సాహితీ సేవకు అంకితమయ్యారు. ఇంతవరకు 78 గ్రంథాలను ప్రచురించిన చంద్రమౌళి 34 నవలలు, 427 కథలు, 16 కవిత్వ సంపుటాలు, 3 నాటకా లు, 4 విమర్శన గ్రంథాలు వెలువరించారు. వివిధ దేశాల్లో జరిగిన ప్రపంచ కవుల సదస్సులో పాల్గొని తన కవితలను వినిపించారు. 2020లో రాష్ట్ర అత్యున్నత సాహిత్య అవార్డు కాళోజీ పురస్కారాన్ని మాజీ సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అందుకున్నారు. 2007లో తెలుగు విశ్వవిద్యాలయం, 2008లో సినారే, 2012లో డాక్టర్ సోమసుందర్, కొలకలూరి భాగీరథీ, 2015లో గుంటూరు శేషేంద్రశర్మ కవిత్వ పురస్కారంతో పాటు ముంబై, ఫిలిప్పీన్స్ ప్రభుత్వ జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. 2022 జూలై 7న తెలుగు విశ్వవిద్యాలయం ఆయన రచించిన బృహత్ నవల కాలనాళికకు 2019కి సంబంధించి ఉత్తమ నవలా పురస్కారాన్ని అందజేసి గౌరవించింది.

**వివిధ దేశాల జీవిత కాల సాఫల్య పురస్కారాలు**

2019లో ప్రపంచ వ్యాప్తంగా సాహితీవేత్తల నుంచి 2386 ఎంట్రీలను పరిశీలించి, నాజీ నామన్, లెబనాన్ ప్రపంచస్థాయి జీవితకాల సాఫల్య పురస్కారాన్ని చంద్రమౌళికి అందజేశాయి. ఆనాడు భారత్ నుంచి ఒక్క రామా చంద్రమౌళికి మాత్రమే దక్కడ విశేషం. ఆయన రచించిన కథలు, కవిత్వం, నవలలు అనేక భారతీయ భాషల్లోకి అనువదించబడి, జాతీయ అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టాయి.



భూపాలపల్లి రూరల్ : దివ్యాంగ అభ్యర్థిని తనిఖీ చేస్తున్న పోలీసులు

# ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్ష

## ఆలస్యంగా వచ్చిన పలువురు అభ్యర్థులు

- కేంద్రాల్లోకి అనుమతించని అధికారులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 55 శాతం మించని హాజరు
- సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు



హనుమకొండలోని కేడీసీలో గ్రూప్-3 పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆదివారం గ్రూప్-3 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం పేపర్-1, మధ్యాహ్నం పేపర్-2 జరుగగా, అభ్యర్థుల హాజరు 55 శాతానికి మించలేదు. అక్కడక్కడా పరీక్ష సమయానికంటే ఆలస్యంగా పలువురు అభ్యర్థులు రావడంతో వారిని అధికారులు లోనికి అనుమతించకపోవడంతో కొద్దిసేపు అక్కడే ఉండి ఇళ్లకు వెళ్లిపోయారు. ఉమ్మడి జిల్లాలోని వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో మొత్తం 174 సెంటర్లు ఏర్పాటు చేయగా, 62,695 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉంది. కాగా ఉదయం 33,784, మధ్యాహ్నం 33,608 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు హాజరైన అభ్యర్థుల్లో 176 మంది మధ్యాహ్న పరీక్ష రాయలేదు. పరీక్షార్థులకు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపగా, పోలీసులు సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు బందోబస్తు నిర్వహించారు. పరీక్షా కేంద్రాలను ఆయా జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పరిశీలించారు. కాగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో పరీక్ష రాయాల్సిన మహిళా అభ్యర్థి జడ్పీ ఉన్నత పాఠశాలకు చేరుకుంది. విషయం తెలుసుకొని మోడల్ స్కూల్‌కు వెళ్లే సరికి సమయం మించిపోవడంతో లోనికి అనుమతించలేదు. దీంతో చేసేదేమీ లేక ఇంటికి తిరిగి వెళ్లిపోయింది.

**జిల్లాల వారీగా పరీక్షకు హాజరైన అభ్యర్థులు**

| జిల్లా | సెంటర్లు | మొత్తం అభ్యర్థులు | ఉదయం హాజరైనవారు | మధ్యాహ్నం హాజరైనవారు |
|---|---|---|---|---|
| హనుమకొండ | 83 | 32,864 | 17,572 | 17,437 |
| వరంగల్ | 28 | 10,913 | 5,513 | 5,489 |
| జనగామ | 16 | 5,446 | 3,120 | 3,107 |
| మహబూబాబాద్ | 21 | 7,592 | 4,373 | 4,373 |
| భూపాలపల్లి | 17 | 3,707 | 2,023 | 2,020 |
| ములుగు | 9 | 2,173 | 1,183 | 1,182 |
| మొత్తం | 174 | 62,695 | 33,784 | 33,608 |



గణపురం : పరీక్షా కేంద్రంలోకి అనుమతించకపోవడంతో మోడల్ పాఠశాల గేటు వద్ద నిల్చున్న మహిళా అభ్యర్థులు



మామునూరు ఎయిర్‌పోర్టు (ఫైల్)

# మామునూరు ఎయిర్‌పోర్టుకు రూ. 205 కోట్లు

**భూసేకరణకు నిధులు విడుదల చేసిన ప్రభుత్వం**

కరీమాబాద్, నవంబర్ 17: మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన 253 ఎకరాల భూసేకరణలో భాగంగా రూ. 205 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ మేరకు నిర్మాణానికి సంబంధించిన డిజైన్‌లతో కూడిన డీపీఆర్‌ను సిద్ధం చేయాలని కోరుతూ ఆర్‌అండ్‌బీ శాఖ ఎయిర్‌పోర్టు అథారిటీకి లేఖ రాసింది. గతంలో మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న 150 కిలోమీటర్ల ఒప్పందాన్ని జీఎంఆర్ సంస్థ విరమించుకుంది. దీంతో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అడుగులుపడ్డాయి. ఇప్పటికే దీని పరిధిలో దాదాపు 696 ఎకరాల భూమి ఉంది. ప్రస్తుతం సేకరించనున్న 253 ఎకరాల భూమిని రన్‌వే విస్తరణ, టెర్మినల్ బిల్డింగ్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ), నావిగేషనల్ ఇన్‌స్ట్రుమెంట్ ఇన్‌స్టాలేషన్ విభాగాల కోసం కేటాయించనున్నారు.



## లక్నవరంలో సండే సందడి

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు వద్ద సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో పాటు పర్యాటకులు భారీగా తరలివచ్చి ప్రకృతి అందాలను తిలకించారు. వేలాడే వంతెనలపై నడుస్తూ బోటులో షికారు చేశారు. – గోవిందరావుపేట, నవంబర్17

# కాలగర్భంలో చారిత్రక మెట్ల బావి

**ఎన్‌హెచ్ విస్తరణలో పూడ్చివేసిన కాంట్రాక్టర్**

- పురాతన కాలం నాటి ఆనవాళ్లు భూస్థాపితం
- అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణా లోపంతోనే కనుమరుగు



గట్టమ్మ ఆలయ సమీపంలోని మెట్ల బావి (ఫైల్)

ములుగు, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ) : చారిత్రక పరంగా ములుగు జిల్లాలోని పలు ప్రాంతాలు ఎంతో ప్రాచుర్యం కలిగి ఉన్నాయి. కాకతీయుల కాలం నాటి ఆనవాళ్లు ఇప్పటికి జిల్లాలోని ఏదో ఒక చోట దర్శనమిస్తుంటాయి. ఇందులో భాగంగా జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న గట్టమ్మ దేవాలయం సమీపంలో పురాతన కాలం నాటి మెట్లబావి మొన్నటి వరకు చెట్ల పొదల మాటున దాగి ఉండేది. గట్టమ్మ గుడి నుంచి హనుమకొండ జిల్లా గూడెప్పాడ్ వరకు కొంత కాలంగా కొనసాగుతున్న జాతీయ రహదారి 163 విస్తరణ పనుల్లో ఈ మెట్ల బావి భూస్థాపితమైంది. నిరుపయోగంగా ఉన్న పాతకాలం నాటి మెట్ల బావిని పూడ్చితే తమను అడిగే వారు ఉండరనో.. దాని చరిత్రను తెలుసుకోకుండానో సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డు పనుల్లో తీసిన మట్టిని పోయడంతో ప్రస్తుతం ఈ బావి కాలగర్భంలో కలిసిపోయింది. గట్టమ్మ సమీపంలోని పానిషా వద్ద చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా వెలికి తీసిన మట్టిని వేరే చోటకు తరలించాల్సి ఉండగా కాంట్రాక్టర్ రోడ్డు పక్కనే పోయించాడు. ఈ క్రమంలో అక్కడ మెట్ల బావి ఉన్న విషయాన్ని ఉన్నతాధికారులకు చెప్పకుండా ఇష్టారీతిన మట్టి పోయడంతో బావి కనుమరుగైంది. అయితే ఈ మెట్ల బావి బాట సారులు, గొర్ల, పశువుల కాపర్ల దాహార్తిని తీర్చేందుకు ఉపయోగపడేదని ప్రజలు చెబుతున్నారు. ఈ బావి నీళ్లు తియ్యగా ఉంటాయని పేర్కొంటున్నారు. చేదుకునే అవసరం లేకుండా నేరుగా బావిలోకి దిగి బిందెలతో తెచ్చుకునేందుకు వీలుగా రాళ్ల మెట్లతో సుమారు 150 ఏళ్ల క్రితం ఈ బావిని నిర్మించారు. 20 ఏళ్ల క్రితం వరకు ఆ దారి వెంట వచ్చే వారు బావిలోకి దిగి నీళ్లు తెచ్చుకునే వారు. ఈ బావిలో నిన్న మొన్నటి వరకు కూడా నీటితో నిండి ఉండేది. అయితే దీని పక్క నుంచి ఎస్సారెస్పీ కెనాల్‌ను ఎత్తుగా నిర్మించడంతో ఆ బావి ఎన్‌హెచ్‌కు, కెనాల్‌కు మధ్యలో చెట్ల పొదల నడుమ బయటకు కనిపించకుండా ఉండేది. ములుగు జిల్లా ఏర్పడిన తర్వాత అప్పటి కలెక్టర్ గట్టమ్మ గుడి ప్రాంతంతో పాటు మెట్ల బావిని సైతం అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. అయితే అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణా లోపంతోనే మెట్ల బావి రోడ్డు విస్తరణ పనుల్లో కనుమరుగైందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



మెట్ల బావిపై మట్టిని పోస్తున్న జేసీబీ

# ఏజెన్సీలో ధాన్యం దందా

- పచ్చి వడ్ల పేరిట కొనుగోళ్లు
- ధరల్లో దగా.. తూకంలో మోసం
- చోద్యం చూస్తున్న అధికారులు
- అన్నదాతల రెక్కల కష్టం దళారుల పాలు



పడికట్టుతో ధాన్యం బస్తాలను తూకం వేస్తున్న వ్యాపారులు



లారీల్లో ఎక్కించిన ధాన్యం బస్తాలు

వాజేడు, నవంబర్ 17 : ములుగు జిల్లాలోని ఏజెన్సీ మండలాలైన వాజేడు, వెంకటాపురంలో కొందరు స్థానికులతో పాటు ఆంధ్ర ప్రాంతానికి చెందిన వ్యాపారులు దళారులుగా మారి దందా కొనసాగిస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే రైతుల పేరిట వేబిల్లులు తెప్పించుకొని తక్కువ ధరకు రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి వరంగల్, ఖమ్మం, హుజూర్‌నగర్, నేలకొండపల్లి, మండపేట, తాడేపల్లిగూడెం, కోదాడ తదితర ప్రాంతాలకు లారీల్లో తరలించి పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు.

**రైతులను మభ్యపెడుతూ..**

కొంతమంది దళారులు ఇష్టారాజ్యంగా ధరలను నిర్ణయించి రైతుల వద్దకు వెళ్లి క్వింటాకు రూ. 1600, 75 కేజీల ధాన్యం బస్తాకు రూ. 1200 చెల్లిస్తున్నారు. పచ్చి ధాన్యం ఆరిపోతుందని, ఇప్పుడే కేంద్రాల వద్ద కొనరని రైతులను మభ్యపెడుతూ నేరుగా పంటపొలాల్లోకి వెళ్లి ధాన్యాన్ని తక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ దోచుకుంటున్నారు. దీంతో రైతులు ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువకు అమ్మి నష్టపోతున్నారు. తూకంలో మోసం, ధరల్లో దగా చేస్తూ ధాన్యం వ్యాపారం కొనసాగిస్తున్నా పట్టించుకునేవారు లేరు.

**పెట్టుబడి పేరుతో..**

రైతులను ముందస్తు పంటలకు పెట్టుబడి పేరుతో కొందరు, ఎరువులు, పురుగు మందులు ఇచ్చి అధిక వడ్డీలు వేసి మరికొందరు నిలువుదోపిడీ చేస్తున్నారు. రైతులు సైతం చేసేదేమీ లేక నష్టం అని తెలిసినా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దళారులు పాత కాంటాలతో తూకం వేయడంతో పాటు కొన్నిచోట్ల ధాన్యం బస్తాలతో పడికట్టు కడుతూ మోసం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.